ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

'ఫైవ్ స్టార్' వేధింపులకు..
మహిళ బలి..

- వాయిదాలు కట్టలేదని ఇంటికి తాళం
- మనస్తాపంతో ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకీ మితిమీరుతున్నాయి. కిస్తీలు కట్టలేదన్న కారణంతో చట్టాన్ని చేతిలోకి తీసేకొని దౌర్జన్యాల కు పాల్పడుతున్నారు. భట్టిప్రోలు మండలం, వెల్లటూరులో కిస్తీలు సక్రమంగా కట్టలేదన్న కారణంతో ఓ ఇంటికి అక్రమంగా తాళం వేయడంతో రుణం తీసుకున్న మహిళ మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

వెల్లటూరులోని చెన్నకేశవ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బాణా వత్ పార్వతి (45), గోవింద్ దంపతులు రెండేళ్ల క్రితం ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇంటిని తనఖా పెట్టి.. మూడు లక్షల రుణం తీసుకున్నారు. కొన్నాళ్ల పాటు రుణ వాయిదాలను సకాలంలో చెల్లించారు. ఇటీవల ఇబ్బందుల కారణంగా వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. ఈ నేపథ్యంలో కంపెనీ ఏజెంట్లు గ్రామానికి వచ్చి.. పార్వతి ఇంటికి తాళం వేశారు. స్థానికులు, బంధువులు ఏజెంట్లను బతిమిలాడటంతో వెంటనే వాయిదాలు కట్టాలని తాళం ఇచ్చి.. వెళ్లారు. ఈ ఘటనతో తీవ్రంగా మనస్తాపానికి గురైన పార్వతి మంగళవారం సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకుంది. ఇది చూసిన ఆమె కుమారుడు శివశంకర్ ఉరికి వేలాడుతున్న ఆమెను కిందకి దించాడు. కొన ఊపిరితో ఉన్న ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు.. అక్కడ నుండి గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో పార్వతి మృతిచెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శివయ్య తెలిపారు.

'వెట్టిచాకిరీ' ఘటనపై
'బాండెడ్ లేబర్' కేసు నమోదు

- నిందితుడికి భారీ జరిమానా
- విచారణ చేపట్టిన లేబర్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-రేపల్లె

ఎస్టీలతో వెట్టిచాకిరీ చేయించి.. వారిని అమ్మేసిన నిందితులపై బాండెడ్ లేబర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు లేబర్ ఆఫీసర్ జి ప్రభాకర్‌రావు తెలిపారు. ఎస్టీలను వెట్టి చాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్

రేపల్లె మండలం, బొబ్బర్లంకకు చెందిన తమను 15 ఏళ్ల క్రితం కష్ణా జిల్లా, ఎలిసేటి దిబ్బకు పంపి బడా వ్యక్తులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని కలెక్టర్ జె వెంకట మురళికి నిరుపేద ఎస్టీ దంపతులు నంబూరు పద్మ, అగ్ని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దానిపై లేబర్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడయ్యపాలెం గ్రామ పంచాయతీ, బొబ్బర్లంక గ్రామంలో వెట్టి చాకిరీపై ఫిర్యాదు చేసిన దంపతులను, వెట్టిచాకిరి చేయిస్తున్న యజమానిని విచారణ చేశామన్నారు. యజమాని 2లో



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

తాగునీటి ఇబ్బందులపై ముందస్తు చర్యలు

అధికారులను ఆదేశించిన ఎంపీ మాగుంట 8లో

సిఎం హామీల అమలుకు

చిత్తశుద్ధితో పనిచేయాలి..

అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం 8లో



కలెక్టర్ వెంకటమురళి

నకిలీ విత్తనాలతో మునిగిన రైతులు 4లో

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చాలి: ఎంపిపి

ప్రజాశక్తి-కొత్తపట్నం

తాగునీటి సమస్యలు లేకుండా ప్రజల దాహార్తి తీర్చాలని మండల పరిషత్ అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల పనితీరును ఎంపిటిసిలు, సర్పంచులు నిలదీశారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా వస్తున్న జలజీవన్ మిషన్ పథకంలో గత ప్రభుత్వం హయాంలో పైప్‌లైన్లు నిర్మించడం జరిగిందని వాటికి సరైన బోర్లు వేయకపోవడంతో నీటి సరఫరా అందులో లేదని ఎంపిటిసిలు, సర్పంచులు వాపోయారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ప్రస్తుతం నిధులు మంజూరు చేసిందని, అవి దశలవారీగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపిపి అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో శాశ్వత నీటి పరిష్కారానికి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే తప్ప పరిష్కారం కుదరదని అన్నారు. విద్యాశాఖపై ఎంఈఓ పద్మావతి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూల్స్ ఫౌండేషన్ స్కూల్స్ ప్రారంభం అవుతున్నాయని అన్నారు. అన్ని శాఖలపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీకృష్ణ, తహశీల్దారు మధుసూదన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

వైద్యం కోసం వృద్ధుడి నిరీక్షణ

ప్రజాశక్తి-మార్కాపురం


డి ఖాజా

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పేదోడికి వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. వైద్యశాలలో కొందరు వైద్యులు, వారికి వంతపాడే సిబ్బంది వ్యవహారశైలితో వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య కూడా తగ్గిపోయింది. మందులు, ఇతర సామగ్రి అవసరమైతే రోగితో కొనుగోలు చేయించడం ఇక్కడ అలవాటుగా మారింది. పేదోడికి ఉచిత వైద్యం అందే పరిస్థితులు ఇక్కడ కనిపించడం లేదు.. మార్కాపురం డివిజన్‌లోని బేస్తవారిపేటకు చెందిన దూదేకుల ఖాజా(75) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు నా అనే వారు ఎవ్వరూ లేరు. ఆయాసం, జ్వరంతో బాధపడుతున్నాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. చేసేదేమీ లేక పెద్దాసుపత్రి కదా అని మార్కాపురం వచ్చాడు. ఇక్కడి ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపి విభాగంలో మాత్రమే చికిత్స నిర్వహించారు. ఆ వృద్ధుడి పరిస్థితి మాత్రం సీరియస్‌గా ఉంది. అక్కడే వైద్యం పొందుతానని ప్రతిమాలినా అక్కడి వైద్యులు అంగీకరించలేదు. చేసేదేమీ లేక ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యం కోసం అక్కడే పడిగాపులు కాస్తున్నాడు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నా అక్కడి వైద్యులు కనికరించడం లేదు. అతనికి ఆహార పానీయాలు కూడా అక్కడకు వచ్చిన జనం మానవత్వంతో సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం లేదు పొమ్మంటున్నారని వృద్ధుడు వాపోతున్నాడు.

'వెట్టిచాకిరీ' ఘటనపై 'బాండెడ్ లేబర్' కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

చెన్ను ఆదిశేషరావుపై నేరం రుజువు కావడంతో బాండెడ్ నిర్మూల చట్టం కింద కేసు నమోదు చేసి.. భారీ జరిమానా (రూ.6 లక్షలకు పైగా..) విధించడం జరిగిందన్నారు. ఈ విధంగా కార్మికులను నిర్బంధించి వెట్టిచాకిరి చేయిస్తే కార్మిక చట్టం, లేబర్ చట్టాలను ఉపయోగించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాండెడ్ లేబర్ ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే 9492555163 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని అంబేద్కర్ నగర్‌లో గల ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలతో కలిసి ఎంఈవో పి ఆంజనేయులు, మల్లు నాయక్ బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరాల వయసు నిండిన వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మండలంలో 31 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మారాయని చెప్పారు. వాటిలో తరగతికి ఒక టీచర్ మాత్రమే ఉంటారన్నారు. విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వ పాఠశాలల సహకారం ఎంతో అవసరమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు బడికి అలవాటు పడతారని, బడి అంటే భయం లేకుండా ఉండే విధంగా తర్ఫీదునిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవస్వామి, తిరుపతి నాయక్, శ్రీకాంత్, సిఆర్‌ఎంటిలు కోటేశ్వరరావు, జివిఎల్ఎస్ మూర్తి, యల్లయ్య, హనుమానాయక్‌లతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, రామకుమారి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిశువుల సంరక్షణ విభాగం తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని ఐటిడిఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ తోకల రవి, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విభాగంలో చికిత్స పొందుతున్న శిశువుల ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించడంతో పాటు, అక్కడ ఉన్న శిశువుల తల్లిదండ్రులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడి సేవల పట్ల వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులిద్దరూ మాట్లాడుతూ నవజాత శిశువులకు అవసరాన్ని బట్టి వారంరోజుల పాటు వైద్యం అందిస్తున్నాం. మరింత అధిక చికిత్స అవసరమయ్యే పరిస్థితుల్లో ఒంగోలు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలకు తరలిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మళంపాడు ఆంజనేయస్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గుమ్మళంపాడు గ్రామ సమీపంలోని నిధి వద్దగల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 60వ వార్షికోత్సవ తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఆలయ అర్చకులు అన్నావజ్జుల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శాండిల్య శర్మ తదితర 25 మంది వేద పండితుల బృందం పర్యవేక్షణలో ఆకు పూజలు, అష్టోత్తర పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, కొండెపి, టంగుటూరు, ఒంగోలు, పొదిలి తదితర మండలాల నుంచి భక్తులు ఈ తిరునాళ్లకు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లను భక్తులు ప్రదక్షిణలు చేశారు.


టిఎల్ కాంతారావును సత్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్

కాంతారావుకు డీఈవో సత్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

జిల్లా హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షులు టిఎల్ కాంతారావును జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని పదో తరగతి మూల్యాంకనం శిబిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో సత్కరించారు. టిఎల్ కాంతారావు బండ్లమూడి క్లస్టర్ చైర్మన్‌గా, ఎంఈఓగా, హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా పలు సేవలందిస్తూ మే 31వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ ఏ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంతారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ టి కిషోర్‌బాబు, జిల్లా పరీక్షల అధికారి కోదూరి శివకుమార్, అసోసియేషన్ కార్యదర్శి వై వెంకట్రావు, కోశాధికారి జిఎస్ఆర్ సాయి, ఎంఈవో బత్తుల నాగేంద్రవదన్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు: స్థానిక సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. అమెరికాకు చెందిన అముక్త నాయుడు జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదాన వేడుకలు నిర్వహించారు. సేవా సంకల్ప్ ట్రస్టు ఫౌండర్ ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దేశ విదేశాల నుంచి దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక పక్క సేవా కార్యక్రమాలు, మరొక పక్క అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. సంతనూతలపాడు అంగన్‌వాడీ కేంద్రానికి ట్రస్ట్ సభ్యురాలు భాస్కరుని సుధారాణి స్వచ్ఛందంగా ఫ్యానుని, పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రెటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రెటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగలక్ష్మి, పార్వతీబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, ఆర్ జ్యార్జి, బి సుధారాణి, సిహెచ్ చంద్రావతి, ఎస్ ధనలక్ష్మి, వేమా కవిత, శీలం మల్లారెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం కావడంతో పూజల సత్యనారాయణ రూ.లక్ష ఆస్తి నష్టానికి గురయ్యాడు. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రితో పాటు బియ్యం, నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పూరి గుడిసె కోల్పోయిన బాధితుడు పూజల సత్యనారాయ ణకు రూ.పది వేలు ఆర్థిక సాయం చేయాలని తెలిపారు. దీంతో బుధవారం వైసిపి మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి అయ్యంబొట్లపల్లి గ్రామానికి వెళ్లి కాలిపోయిన పూరి గుడిసెను పరిశీలించారు. బాధితునితో మాట్లాడారు. రూ.పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబులరెడ్డి, వైస్ ఎంపిపి ఆదిశేషు, సర్పంచ్ రాగుల వెంకటయ్య, సొసైటి ప్రెసిడెంట్ గూడా వెంకటరెడ్డితో పాటు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని బుధవారం గిద్దలూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో కొమరోలు కార్యకర్తలకు బోనేని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోనేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునే దిశగా కృషి చేస్తామని అన్నారు. గత వైసిపి పాలనలో కొమరోలు మండల గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అవినీతి, అరాచకాలే జరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యకర్తలు గోడి ఓబుల్ రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మల్లారపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..

తల్లిని హతమార్చిన తనయుడు

భట్టిప్రోలులో ఘటన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కోపంతో నిద్రిస్తున్న తల్లిని కుమారుడు కత్తితో పొడిచి హతమార్చిన ఘటన భట్టిప్రోలులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివయ్య కథనం ప్రకారం... స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక నివాసం ఉంటున్న అంగలకుదురు అన్నపూర్ణమ్మ (74) కూలి నాలి పని చేసుకుని జీవనం సాగిస్తుంది. ఆమె పెద్దకుమారుడు దుర్గారావు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన దగ్గర డబ్బులు లేవని అన్నపూర్ణమ్మ తెలిపింది. దీంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. అనంతరం మృతురాలు పని నుంచి వచ్చి భోజనం చేసి పడుకుంది. ఆమె మంచం పక్కనే పడుకున్న దుర్గారావు తనకు డబ్బులు ఇవ్వలేదనే అక్కస్సుతో నిద్రిస్తున్న తల్లి తలపై, మెడపై కత్తితో విచక్షణా రహితంగా నరికాడు. దీంతో అన్నపూర్ణ అక్కడికక్కడే మతి చెందింది. ఈ విషయం గుర్తించి ఇరుగుపొరుగు వారు చిన్న కుమారుడు వెంకటేశ్వరరావుకు అందించారు. వెంకటేశ్వరరావు వచ్చి చూడగా అప్పటికే తల్లి


అన్నపూర్ణమ్మ(ఫైల్)


ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

రక్తపు మడుగులో పడి ఉంది. వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించగా ఆమె అప్పటికే మతి ఉంది. దుర్గారావు ఆయన భార్య మధ్య మనస్పర్ధలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటినుంచి దుర్గారావు తల్లితో కలిసి ఉంటున్నాడు. వేమూరు ఎస్ఐ పసుపులేటి ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచినామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యశాలకు తరలించాడు. మృతురాలి చిన్న కుమారుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరువ్యాపారాల ద్వారా అభివృద్ధి చెందాలి

ఎన్‌టిఆర్ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ స్మిత్

ప్రజాశక్తి- చెరుకుపల్లి

రైతులు మారుతున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని చిరు వ్యాపారాల ద్వారా అభివృద్ధి సాధించాలని బాపట్లలోని డాక్టర్ ఎన్‌టిఆర్ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ స్మిత్ తెలిపారు. మండల పరిధిలోని ఆరుంబాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద డాక్టర్ ఎన్‌టిఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల మరియు ప్రొటెక్ట్ సంస్థ వారిచే అఖిల భారత వ్యవసాయ పరిశోధన గిరిజన ఉప ప్రణాళిక వారి సౌజన్యంతో హైడ్రోపోనిక్స్ సాంకేతిక సాగు మరియు నర్సరీ మేనేజ్మెంట్‌పై క్షేత్ర ప్రదర్శన మరియు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డిడి స్మిత్ మాట్లాడుతూ నూతన సాంకేతిక టెక్నాలజీ గురించి


మహిళా రైతులకు మొక్కలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గిరిజనులు, రైతులకు అవగాహన కల్పించారు. ఏరో టవర్లు మరియు ఎన్ఎఫ్ టి స్ట్రక్చర్ ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఈ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని తెలిపారు. డిఎఫ్ఐ భీమయ్య ప్రోగ్రాం గురించి వివరించారు. ఏ క్రమ దశ నుంచి ఏ క్రమ వరకు టెక్నాలజీ అనేది మొక్కల్లో ఎలా పెరిగిందో చెప్పి అలాగే ఈ హైడ్రోపోనిక్స్ ఈ కొత్త రకమైన టెక్నాలజీని ప్రజలందరూ వినియోగించుకుని ఇంకా ఈ నూతనమైన టెక్నాలజీని చిరు వ్యాపారాలు పెట్టుకొని సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. ఎస్. చంద్ర రెడ్డి నర్సరీ పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి ,డాక్టర్ హేమ కుమార్ , చైతన్య, గిరిజన రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజలు నేరుగా తనను కలిసి వారి సమస్యలను తెలిపి పరిష్కరించు కొనేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్లలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం కషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామన్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను తాను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వేమూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుశీల, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- అమృతలూరు

మండల పరిధిలోని ప్యాపర్రు గ్రామ రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు కమ్యూనిటీ మేనేజ్మెంట్ నేచురల్ ఫార్మింగ్‌పై మండల స్థాయిలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐ ఉయ్యూరు లోకేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించుటకు వ్యవసాయ సహాయకులు కషి చేయాలన్నారు మండల ప్రణాళిక – 2025 గురించి నాచురల్ ఫార్మింగ్‌లో పనిచేయుచున్న సిఆర్‌పిలు, ఐసి ఆర్‌పిలు, వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ప్రాజెక్టు అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రకతి వ్యవసాయం సాగు చేసే


రైతులకు కిట్లు అందజే స్తున్న ఎఐ లోకేశ్వరి

రైతులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తూ వారితో పాటు కొత్తగా ప్రకతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మండల సమైక్య, మరియు గ్రామ ఐక్య సంఘాలు ఎక్కువ మంది రైతులు ప్రకతి వ్యవసాయం చేసేందుకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఏపిఎం ఎస్.రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గడ్డిపాటి హేమచంద్ర శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, నాచురల్ ఫార్మింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న హనుమంతరావు దంపతులు

ఆలయ మండపానికి లక్ష విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి రాతి ముఖ మండప నిర్మాణానికి చిన్నగంజాం గ్రామానికి చెందిన శంకరమంచి హనుమంతరావు దంపతులు రూ.1,00,116 రూపాయలు విరాళాన్ని బుధవారం అందజేశారు. దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి మదమంచి తిమ్మనాయుడుకు నగదు రూపంలో విరాళం అందజేశారు.


రక్తదానం చేస్తున్న దాతలు

లారీ డ్రైవర్‌కు రక్తదానం

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ చాంద్ బాషాకు బైపాస్ సర్జరీ నిమిత్తం అర్జెంటుగా రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో చాంద్‌బాషా బంధువులు రోటేరియన్ హాజీ సయ్యద్ మౌలాలి, కరిముల్లా రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావునుసంప్రదించారు. స్పందించి మురళీ సుధాకరరావు అద్దంకి బలిజపాలెంకి చెందిన ధర్మవరపు మోహన కృష్ణ, కాకాని పాలెం సచివాలయం ఉద్యోగి మోతుకూరి రాజీవ్‌ను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా రక్తదాతలు, మురళీ సుధాకరరావును రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అభినందించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - చిన్నగంజాం

చిన్నగంజాం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుబంగారుపాలెం గ్రామం నుంచి చిన్నగంజాం వెళ్లే రాంప్రోలు పోవు రోడ్డు వద్ద అనుమానాస్పదం తిరుగుతున్నత చిన్నగంజాంకు చెందిన షేక్ ఖాజావలి అదుపులోకి తీసుకొని విచారించారు. అతని వద్ద 9 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లోపీరాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీహరి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 27 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసు స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల ప్రకారం... చిన్నగంజాం మండలం సంతరావూరుకు చెందిన రామిశెట్టి రాజేంద్ర కుమార్ ఆటోలో 25 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. అదే సమయంలో ఎస్ఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అటువెళ్లిన ఆటోను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆటోలో రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్ గ్రేషియా విడుదల

ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


బస్సు ప్రమాద బాధితులకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ గ్రేషియా విడుదల చేశారు. గత ఏడాది మేలో పసుమర్తి – చిలకలూరిపేట మధ్య జరిగిన బస్సు ప్రమాదంలో మతి చెందిన కుటుంబాలను ఆదుకొని అండగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందజేశారు. ఇటీవల చిన్నగంజాం పర్యటనలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరి సిఎం చంద్రబాబు దష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత కుటుంబాల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరికి సిఎంఒ నుంచి సమాచారం అందింది. గత ఏడాది మేలో చోటు చేసుకున్న బస్సు ప్రమాదంలో చిన్నగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి , ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ మతి చెందారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున , క్షతగాత్రులకు రూ.2.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా విడుదల చేశారు. ముప్పరాజు దుర్గాపూజ, ముప్పరాజు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి భావన, దావులూరి అంజమ్మలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున , క్షతగాత్రులు బాడుగు సంజన, గడిపాటి తేజస్విని , దొప్పలపూడి భావనఉ ఒక్కరికి రెండున్నర లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచినందుకు సిఎంకు బాధిత కుటుంబాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలు ఆర్థికంగా బలపడాలి : ఎపిఒ

ప్రజాశక్తి - పంగులూరు



మండల పరిధిలోని కూలీలు ఉపాధి పనులను ఉపయోగించకొని ఆర్థికంగా బలపడాలని ఎపిఒ కె. సంతోషం తెలిపారు. ఎపిఒ బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూలీలు ఉదయం సమయంలో పనికి రాలేకపోతే , సాయంత్రం మూడు గంటల నుండి 6 గంటల వరకు పని చేసుకోవాలన్నారు. ఏప్రిల్, మే ,జూన్, నెలల్లో ఉపాధి పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మూడు నెలల కాలంలో కూలీలు ఉపాధి పనులకు రావాలని కోరారు. ఉపాధి పనులకు వచ్చే కూలీలు వారి ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి డిమాండ్ ఇవ్వాలన్నారు. డిమాండ్ ఇచ్చినవారు పనికి వెళ్ళవచ్చని తెలిపారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3,65,058 పని దినాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ కోరారు.



గవర్నర్ చేతులు మీదగా అవార్డు అందుకున్న తిరుపతిరావు

తిరుమలరావుకు అవార్డు

ప్రజాశక్తి- చీరాల

తెలంగాణాలోని శంకర్‌పల్లిలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ పల్లెసజన సంస్థ రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఈ ఎగ్జిబిషన్‌లో చీరాల ప్రాంతానికి చెందిన నన్నం తిరుపతిరావు ఫుల్ క్లైమ్బింగ్ షూ ఇన్నివేషన్ ప్రాజెక్టు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా తిరుపతిరావుకు అవార్డు అందజేసి సన్మానించారు.

గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి- రేపల్లె

పెంచిన గ్యాస్‌ధర తగ్గించాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ బొమ్మవద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధర కొంతమేర తగ్గించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చాకా ఇప్పుడు సిలిండర్ ధర రూ.50 పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో బిజెపి కూటమిలో భాగస్వామిగా ఉన్న టిడిపికి కూడా గ్యాస్ ధర పెంపులో భాగస్వామ్యం ఉందని ప్రజలు గమనిస్తున్నారన్నారు. భారతదేశంలో కార్పొరేట్ వ్యాపారవేత్తలు, అదానీ లాంటి వారికి వేల కోట్ల రూపాయలు కేంద్రప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. కష్టజీవులు,పేదలు రోజువారీగా ఉపయోగించుకునే గ్యాస్ ధరలు పెంచడం సిగ్గుచెట్టుని విమర్శించారు. రాష్ట్రంలో రూ. 842 రూపాయల గ్యాస్ సిలిండర్‌కు ఇప్పుడు రూ. 892 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్న టిడిపి ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపుపై కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేయాలన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినందున అందుకు అనుగుణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూడాల్సి కేంద్ర ప్రభుత్వం సుంకాన్ని పెంచి తమ ఖజానాలో వేసుకుంటున్నట్లు తెలిపారు. మరో వైపు పెట్రోల్,డీజిల్ ధరలు పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నేతలు కేవి.లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, వై.కిషోర్, కె.గోపి, కే.రమేష్,కె. నాంచారమ్మ, డి.అగస్టిన్, జి. దానియేలు, డి.బాబూరావు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. తాజాగా గ్యాస్ సిలిండర్ రూ.50 రూపాయులు పెంచినట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ పై విధించిన రెండు శాతం పన్నులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ప్రతిపక్షం మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు, అడ్వకేట్ డి.గంగాధర్ ఫ్రూట్ వెండర్స్ కమిటీ కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, ఎస్‌కె.కరీంమ్, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు గణేష తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో నిరసన తెలుపుతున్న నాయకులు



అద్దంకిలో నిరసన తెలుపుతున్న నాయకులు

భట్టిప్రోలు : పెంచిన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని వాగ్ధానం చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 11 సంవత్సరాల కాలంలో లెక్కలేని విధంగా అనేక సార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే బిజెపి ప్రభుత్వం గ్యాస్ , పెట్రోల్ ధరలను పదే పదే పెంచుతుందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు డి. శ్రీనివాసరావు, ఓబులేశెట్టి రమేష్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మునిగిన రైతులు

- కండెలు రాని మొక్కజొన్న
- నష్టాలతో ఆత్మహత్య చేసుకున్న రైతు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ప్రజాశక్తి-ఇంకొల్లు

మండల పరిధిలోని నాగండ్ల, పావులూరు, నక్కలపాలెం, మార్టూరు మండలంలోని ద్రోణాదల, పంగులూరు మండలంలోని చందలూరు, పంగులూరు గ్రామాల రైతులు 125 ఎకరాలలో అడ్వాంట కంపెనీ, సీజంట కంపెనీలకు చెందిన సంకరజాతి మొక్కజొన్న విత్తనాలు నాటారు. ఎకరాకు రూ.80 వేల వంతున పెట్టుబడి పెట్టారు. విత్తనాలు అమ్మె సమయంలో తాము కంపెనీ ప్రతినిధులమని,ఏజెంట్లమని చెప్పారు. అయితే అవి నకిలీ విత్తనాలు కావడంతో పంట పూర్తిగా దెబ్బతింది. నాగండ్లకు చెందిన రఘు(28) అనే యువరైతు ఈ సంకరజాతి విత్తనం మూడు ఎకరాలలో సాగదు చేశాడు. పంట పూర్తి దెబ్బతి తింది. రూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆయన 20 రోజుల క్రింతం తాను మొక్కజొన్న పంట సాగుచేసిన పొలంఉన్న బావిలోనే దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

రబీ సీజన్ కింద మొక్కజొన్న సాగు చేసే రైతులకు అడ్వాంట కంపెనీ మరియు సీజంట కంపెనీ పేరుతో కొంతమంది కంపెనీ ప్రతినిధులు గ్రామాలలో తిరిగి సంకరజాతికి చెందిన సంపర్కం జరిపిన విత్తనాలు రైతులకు ఉచితంగా ఇచ్చారు. ఆ సమయంలో తాము కంపెనీ ప్రతినిధుమని, స్థానిక ఏజెంట్లు చెప్పారు. బాండు ఇచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తామని చెప్పాడు. పెట్టుబడి సాగు కింద ఎకరాకు రూ. 20వేలు చెల్లిస్తామని తెలిపారు. పురుగు మందులు, కలుపు మందు ఉచితంగా ఇస్తామని తెలిపారు. నాగడ్ల, ద్రోణాదల, నక్కలపాలెం, పావులూరు గ్రామాలకు రవీంద్ర, సుబ్బారెడ్డి వ్యక్తులు కంపెనీ ప్రతినిధులుగా వచ్చారు. ద్రోణాదలకు చెందిన ముప్పరాజు చిన్న చిన్నక్కలపాలెం చెందిన బాచిన రాములు వచ్చి రైతులకు కంపెనీ వారు చెప్పిన మాటలే చెప్పారు. దీంతో మొక్కజొన్న సాగు చేశారు. పంట చివర దశకు వచ్చేసరికి కండెలకు గింజలు రాలేదని రైతులు చెప్పారు. అసలు కొన్ని మొక్కలకు కండె కూడా పుట్టలేదని ద్రోణాలకు చెందిన కొల్లి సీతా రామయ్య, లావణ్య నాగాళ్లకు చెందిన కంచుగంటి వెంకటేశ్వర్లు, నందిగం వినీత్, ఇసుక పల్లికి చెందిన హనుమంతరావు, బత్తుల రామారావు తెలిపారు. ఎకరానికి రూ.80 వేల వంతున ఖర్చున చేసినట్లు తెలిపారు. అయితే ఎకరాకు క్వింటా విత్తనాలు కూడా పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ విత్తనాల కారణంగా తాము నష్టపోయిన విషయం గురించి పంగులూరు, ఇంకొల్లు ఏఒలకు దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. అదేవిధంగా పర్చూరు ఎడిఎ దష్టికి కూడా తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి నకిలి విత్తనాల కారణంగా నష్టపోయిన తమకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నకిలీ విత్తనాల సంచులు చూపుతున్న రైతులు

నష్టాలతో యువరైతు ఆత్మహత్య



రఘు బాబు (ఫైల్)

అవాంట, సీజెంటా మరియు భారతి సీడ్స్ పేరుతో సంకరజాతి నకిలీ విత్తనాల కారణంగా తీవ్ర నష్టపోయిన రైతు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటన నాగండ్ల గ్రామంలో 20 రోజుల క్రితం చోటు చేసుకుంది. మృతుడి తండ్రి హనుమంతరావు, నాగండ్ల మొక్కజొన్న రైతులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యువరైతు ఇసుకేపల్లి రఘు బాబు (28) మూడు ఎకరాలలో సీడ్ మొక్కజొన్న సాగు చేశాడు. అయితే కంపెనీ వారు చెప్పినవిధంగా దిగుబడి రాలేదు. ఎకరానికి క్వింటా దిగుబడి కూడా వచ్చేపరిస్థితి లేదు. కొన్ని మొక్కలకు అసలు కండలే పుట్టలేదు. అక్కడక్కడ పుట్టిన కండెలకు రెండు నుంచి ఐదు విత్తనాల లోపే ఏర్పడ్డాయి. వద్దంటే సంకరజాతి విత్తన మొక్కజొన్న సాగు చేసి నష్టపోయామని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో రఘుబాబు మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో అప్పుల బాధలు కూడా ఎక్కువ అయ్యాయి. తాను మొక్కజొన్న సాగుచేసిన పంట పొలంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉద్యోగోన్నతుల్లో

మెరిట్ కం రోస్టర్ విధానం అమలుచేయాలి

ఫ్యాప్టో డిమాండ్



డిఇఒకు అర్జీ ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మే నెలలో చేపట్టనున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల జాబితాను మెరిట్ కం రోస్టర్ విధానంలో తయారు చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. రోస్టర్ విధానం అమలు చేయకుంటే ఉపాధ్యాయులు సీనియారిటీ కోల్పోతారని, మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతి అమలు చేయాలని బుధవారం నాడు సంఘం నేతలు జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జాబితాలో పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జాబితాలో తప్పులు దొర్లితే ఫ్యాప్టో అంగీకరించదని, మెరిట్ కం రోస్టర్ సిస్టమ్ అమలుచేయని పక్షంలో ఫ్యాప్టో తరపున ఉద్యమం చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య, సెక్రటరీ జనరల్ ఎస్ఎండి.రఫీ, కోచైర్మన్లు వి.మాధవరావు, డి.జయరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై, వి.జనార్ధన్‌రెడ్డి, బి.వెంకట్రావు, సెక్రటరీ వై.వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసులు, డి.వీరాంజనేయులు, కె.శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, ఎస్.రవి, పర్రె వెంకట్రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

బంగారు బాల్యం కార్యక్రమానికి గానూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు ఫ్యాప్టో అభినందనలు తెలిపింది. బుధవారం సాయంత్రం ఆ సంఘ నాయకులు కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి అభినందించారు.

పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి

- ప్రతిపాదనలు రూపొందించండి
- అధికారులకు సూచించిన ఒంగోలు ఎంపీ మాగుంట



బైపాస్ విషయంపై సమీక్షిస్తున్న ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దష్టి పెట్టినట్లు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బైపాస్ రోడ్డు ప్రతిపాదనలపై కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపి మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతో పాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్ళించేలా త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకూ పశ్చిమం వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాసనసభ్యులు అందరినీ సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సంతనూతలపాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే హెవీ వాహనాల రాకపోకలను ప్రధానంగా నియంత్రించాల్సి ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను రూపొందించేటప్పుడు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అధికారులు స్పందిస్తూ నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలను రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి, డిపిఒ జి. వెంకట నాయుడు, ఆర్అండ్‌బి ఎస్ఈ దేవానంద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమమే ధ్యేయం

కలెక్టర్ వెంకట మురళి



సీమంతాలు నిర్వహిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. బుధవారం స్థానిక సాయిరామ్ గార్డెన్ కన్వెన్షన్ హాలులో జిల్లా స్థాయి పోషన్ పక్వాడా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా, శిశు సంక్షేమం కోసం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఈ నెల 8 నుండి 22వ తేదీ వరకు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గర్భిణులు ప్రసవాలు అయిన నాటి నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. అనాథ శిశువుల కోసం రైల్వేస్టేషన్లో బస్టాండ్‌లో ఊయలలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. జిల్లాలో సఖి వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీమంతం చేసుకున్న 20మంది మహిళలకు వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.5 వేల వంతున లక్ష రూపాయలు నిధులను ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖఎస్.ఇ అనంతరాజు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాగుంటకు పుష్పగుచ్ఛమిస్తున్న రవిశంకర్

మాగుంటను కలిసిన రవిశంకర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని రవిశంకర్ గ్రూప్ అధినేత, జిల్లా జనసేన పార్టీ జిల్లా నాయకులు కంది రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు రాంనగర్ 2వ లైన్‌లోని మాగుంట కార్యాలయంలో ఎంపీని కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి బైపాస్ సర్జరీ చేయించుకోవటంతో ఆయన ఆరోగ్య పరిస్థితులను కంది రవిశంకర్ అడిగి తెలుసుకున్నారు. మాగుంటని కలిసిన వారిలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, కష్ణ పెన్నా, ప్రాంతీయ కమిటీ సభ్యు రాలు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, అనిల్ పాల్గొన్నారు.

విశ్రాంత తహశీల్దార్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విశ్రాంత తహశీల్దార్ వేల్పుల అంకమరావుకు పలువురు నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన అంకమరావు సంస్మరణ సభ బుధవారం నాడు ఒంగోలులోని అయ్యప్ప టవర్స్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి భద్రతా కార్యదర్శి హరికిషోర్, ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతి రావు, ప్రముఖ లాయర్ కొమ్మనబోయిన పిచ్చయ్య, తాళ్లూరు మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు పిన్నిక రమేష్, సూరిబాబు, సంఘ నాయకులు పూసపాటి వెంకట్రావు, కొండరాజ్ జయరాం తదితరులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి గ్రౌండ్ వ్యాలిడేషన్ సర్వే

ప్రజాశక్తి-సంతనూతలపాడు

భూముల రీసర్వేలో భాగంగా మోడల్ విలేజ్‌గా ఎంపికైన మట్టిపాడు వేములపాడులో గురువారం నుంచి గ్రౌండ్ వ్యాలిడేషన్ (జి.వి.) కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంతనూతలపాడు తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. గ్రామంలోని 1870 రైతులకు సంబంధించిన 3,207 ఎకరాలలో గ్రౌండ్ ట్రూటింగ్ (జి.టి.) ఈ పాటికే పూర్తయ్యిందన్నారు. గురువారం నుంచి నిర్వహించే జి.వి. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

మహిళలకు అండగా 'శక్తి' యాప్

ఎస్పీ తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భద్రతతో కూడిన ప్రయాణానికి భరోసాగా శక్తి యాప్ లోని "సేఫ్ మై ట్రావెల్" సదుపాయం వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం జిల్లాలోని శక్తి బందాలు వారి పరిధిలోని కళాశాలలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, రైల్వేస్టేషన్ లలో, బస్టాండ్‌లలో, ప్రధాన కూడళ్లలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థినిలకు శక్తి యాప్ ఆవశ్యకతను గురించి విస్తతంగా అవగాహన కల్పిస్తూ, యాప్ ను ఏవిధంగా మొబైల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేసుకొని ఇన్స్టాల్ చేసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు విద్యార్థినులకు అత్యవసర సమయాలలో శక్తి యాప్ అండగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంటే వున్నట్లేనని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆపదలో చిక్కుకున్న మహిళలు, విద్యార్థినిలు యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. వారు వేగవంతంగా ఘటన స్థలానికి చేరుకొని మహిళలకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల వివరాలు అక్కడి పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు, అత్యవసర నెంబర్లు ఈ యాప్‌లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. జిల్లాలోని మహిళలు విద్యార్థినిలు తమ మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

ప్రభుత్వ బడులలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్

'యుటిఎఫ్' పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అన్సారియా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి.. ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు కషి చేయాలని యుటిఎఫ్ తలపెట్టిన ప్రచార కార్యక్రమం పట్ల కలెక్టర్ తమీమ్‌అన్సారియా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని నిర్దేశిస్తూ ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా విద్యా శాఖాధికారి అత్తోట కిరణ్ కుమార్ బుధవారం నాడు వేర్వేరుగా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి,జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి పాల్గొన్నారు

ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలని యుటిఎఫ్ విజ్ఞప్తి చేసింది. బుధవారం నాడు యుటిఎఫ్ ప్రకాష్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కిరణ్‌కుమార్‌ను సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు పి.బాలవెంకటేశ్వర్లు, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎం సంధ్యారాణి, ప్రభాకర్ రెడ్డి, ఎస్వి కొండారెడ్డి, సిహెచ్ ఉమామహేశ్వరరావు, డి జ్యోత్స్న, రమణమూర్తి, ఆర్ నారాయణ, లక్ష్మీనారాయణ, దార్ల శ్రీను, కొప్పోలు హనుమంతరావు, చంద్రశేఖరయ్య, ఎస్.కె జిలాని, టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపున్న సిపిఎం నాయకులు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఎం మండల కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కొండపి

కొండపి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సామాన్యుడి మీద బిజెపి ప్రభుత్వం పెట్రోలు, గ్యాస్ ధరలు సామాన్య ప్రజల మీద భారం మోపుతుందన్నారు. 130 శాతం పెరిగిన వంట గ్యాస్ 74 శాతం పెరిగిన డీజిల్ ధరలు ఎన్డీఏ కూటమి ఎక్సైజ్ సుంకాల పేరిట సామాన్యుడి నడ్డి విరుస్తుందన్నారు. విదేశాల్లో సమురు ధరలు తగ్గుతున్నప్పుడు ఇప్పుడు మన దేశంలో పెట్రోలు, గ్యాస్, డీజిల్ రేట్లు పెంచడం శోచనీయం అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు పెంచుకుంటూ పోతున్నారని, సంస్థల్ని ప్రైవేటు రంగాలకు చౌకగా అమ్ముతున్నారని, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకున్న వారికి జీతాలు పెరగలేదని ఆర్థిక వ్యవస్థని నాశనం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపి మండల కమిటీ సభ్యులు వై.రూబెన్, మల్లెల చిన్న పేతురు, గడ్డం వందనం, శ్రీనివాసులు, జై రావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ పేరుతో ఫ్యాక్షన్ వ్యాఖ్యలు

జగన్ తీరుపై డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ప్రజాశక్తి-దర్శి



గొట్టిపాటి లక్ష్మి

చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే పేరుతో జగన్ ఆడిన నాటకం, పోలీస్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య భావజాలానికి, అహం కారానికి నిదర్శ నమని దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి, కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, స్థానిక నాయకుల సమస్యలు విని వారిలో భరోసా నింపాలి కానీ రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్‌ను తలపిస్తోందన్నారు. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు, ప్రజా స్వామ్యంలో ప్రజల రక్షణ బాధ్యతల్లో తలమునకలైన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా నిలిచాయన్నారు. మహిళా పో లీస్ అధికారులు ఆ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్నారని తెలిసీ జగన్ అలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. పోలీసు లు సరిగా పని చేయకపోతే జగన్ రాప్తాడులో స్వేచ్ఛగా పర్య టించేవారా అని ప్రశ్నించారు. తన పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్ద, పాపిరెడ్డిపల్లె చుట్టూ రక్షణగా నిలిచిన వం దల మంది పోలీసులు జగన్‌కు కనిపించలేదా? అన్నారు. పోలీస్ వ్యవస్థ జగన్ తీరుని ఏమాత్రం ఉపేక్షించకూడద న్నారు. తమపై చేసిన వ్యాఖ్యలకు జగన్ క్షమాపణ చెప్పేవరకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పోరాడాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్

ప్రజాశక్తి-పొదిలి



మాట్లాడుతున్న వెన్న బాల వెంకట్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని ఎపి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెన్న బాలవెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలిలోని ఎన్జీవో హోమ్‌లో బుధవారం సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెన్న బాలవెంకట్, సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్‌లు పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన కూటమి నేతలు, ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమలు చేయడానికి పూనుకోకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తుందన్నారు. కార్మికవర్గాన్ని నమ్మించి మోసగించటం పాలకులకు పరిపాటిగా మారిందిని, గత వైసిపి ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా తీసుకొచ్చిన మెమో 1214ను కూటమి ప్రభుత్వం నేటికి రద్దు చేయలేదన్నారు. బిల్డింగ్ సంక్షేమబోర్డును పునర్దరించి గత ఐదు సంవత్సరాలుగా జిల్లాల్లో లేబర్ కార్యాలయాలలో మంజూరు చేసి నగదు రాకుండా ఆపేసిన క్లయిమ్స్ డబ్బులు చెల్లించాలని, ప్రతి నిర్మాణ కార్మికుడికి ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకు లోన్ ఇవ్వాలని, నిర్మాణ రంగంలో కీలకంగా వాడే ముడి సరుకుల ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తదితర డిమాండ్లతో భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్, జిల్లా కలెక్టర్ మంత్రులకి, ముఖ్యమంత్రిగారికి దృష్టికి తీసుకెళ్లినా కార్మికులగురించి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న ధర్నాలో ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాలలోని నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జె. సురేష్, ఎ. శ్రీనివాసులు, బావన్నారాయణ, యన్. శ్రీను, వెంకట్, శ్రీను,పిచ్చయ్యలు పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి- కనిగిరి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో బుధవారం సిఐటియు రాజకీయ శిక్షణా తరగతులు ఆర్.మాలకొండయ్య అధ్యక్షతన జరిగాయి. ప్రపంచీకరణ అధ్యయనంపై సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు క్లాసును బోధించగా తరగతులపై ప్రభావం అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె కాలంలో వారి వేతనాలు పెంచుతానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడే పరిస్థితి లేదన్నారు. కొత్తగా తీసుకువచ్చిన యాప్‌లకు తగ్గట్టు అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరియు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, మినీ అంగన్వాడీ లను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలని, ఆయాలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు 16 రోజుల వేతనం వెంటనే ఇవ్వాలని, సంక్రాంతి కానుక చెల్లించాలని కోరారు. ఇంజనీరింగ్ సిబ్బందికి వారాంతపు సెలవులు ఇవ్వాలని జీవో ఉన్న అమలు చేయకపోవడం దారుణం అన్నారు. ప్రైవేటు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ శిక్షణ తరగ తులలో సిఐటియు నాయకులు పిసి కేశవరావు, బడుగు వెంకటేశ్వర్లు, పి.మహేష్, రజిని, కుమారి, రాజ్యలక్ష్మి, శేష య్య, బాలస్వామి, పిచ్చయ్య, నరేంద్ర, అర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

సామాజిక తనిఖీలో వెలుగుచూసిన వైనం

ప్రజాశక్తి-టంగుటూరు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

టంగుటూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ డ్వామా పిడి జోసఫ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. 2023 నుంచి 2024 వరకు జరిగిన 486 పనులకు కూలీలకు రూ.5.23 కోట్లు, మెటీరియల్‌కు రూ.23.72 కోట్లు, మెత్తం 76.4 కోట్లు పనులు జరిగినట్లు తెలిపారు. మండలంలోని అత్యధిక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు నీడ, నీటి సౌకర్యం, వైద్య సౌకర్యం కల్పించాలని సామాజిక తనిఖీ బృందాన్ని కోరడం జరిగింది. ఈ తనిఖీలో పలు విషయాలు వెల్లడయ్యాయి. మర్లపాడులో పాఠశాలలో వేసిన 45 మెక్కలు చనిపోయాయి. పొందూరులో 18 రోజులు వేలి ముద్రలు, సంతకాలు లేకుండా కూలీలలకు నగదు చెల్లించారు. మండలంలోని కందులూరులో జియో టాగింగ్ చేయకుండా పని నేమ్ బోర్డులు ఏర్పాటు చేయక పోయిన నగదు చెల్లించారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఎం. నిడమాలూరులో 45 మెక్కలు తెచ్చారు. మెక్కలు నాట లేదని సామాజిక తనిఖీలో వెల్లడైయింది. టంగుటూరులో మస్టరులో సంతకాలు లేకుండానే నగదు చెల్లించారు. అనంతవరంలో ఫీల్డు అసిస్టెంట్ హాజరు పట్టీలు కొట్టి వేశారు. రూ.నాలుగు లక్షల పైగా నగదు తీసుకున్నట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. జయవరంలో 175 మామిడి మెక్కలు వేయగా 75 మెక్కలు మాత్రమే బతికి ఉన్నాయి. కారుమంచి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వీర బ్రహ్మయ్య తనను అకారణంగా తొలగించారని సామాజిక తనిఖీలో తెలిపారు. తను ఏ తప్పు చేయక పోయినా తనను విధుల నుంచి తొలగించారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దేవసేన కుమారి, ఎపిఓ యస్.మాచెర్ల, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-కొండపి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి పుష్పలత

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని కే.ఉప్పలపాడు పంచాయతీ సెక్రటరీ పుష్పలత అన్నారు. బుధవారం మండలంలోని కే. ఉప్పలపాడులో హెల్పింగ్ హాండ్స్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో దాహం తీర్చడం శుభ పరిమాణం అని అన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని అన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన హెల్పింగ్ యూత్ ఫౌండేషన్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు రాఘవేంద్ర శర్మ, ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రటరీ మధు వైస్ ప్రెసిడెంట్ బాలకష్ణ, సభ్యులు రవి, చిన్నకోటయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విజయాంజనేయస్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-దొనకొండ



ముస్తాబవుతున్న విజయాంజనేయస్వామి దేవాలయం

అడ్డరోడ్డులోని పాపులమ్మ సత్రంలో వెలసిన శ్రీ విజయాంజనేయస్వామి, సుబ్రమణేశ్వరస్వామి 18వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. దేవాలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. దేవాలయంను సర్వాగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి స్వామివారికి అఖండజ్యోతి, దీపారాధన, గనపతిపూజ, మండపారాధన, పంచామృతాభిషేకం, సహస్రనామ తమలార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం నుంచి విద్యుత్ ప్రభలు, పాటకచేరీలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ వేడుకల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయాంజనేయస్వామి తీర్థప్రసాదాలను స్వీకరించి, దేవాలయ అభివృద్ధికి సహకరించాలని ధర్మకర్త బాలిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మూడు నిముషాలు.. 41 అంశాలు..

- అజెండా ఆల్ పాస్‌కు కౌన్సిలర్ల ఆమోదం

- ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులందరూ ఎలాంటి వాదోప వాదనలకు తావు లేకుండా అజెండాలోని అంశాలన్నిటిని ఆమోదించారు. కౌన్సిల్ సమావేశం 11:22 నిముషాలకు ప్రారంభం కాగా అజెండా లోని అన్ని అంశాలను ఆమోదించాలని కౌన్సిలర్ ఉల్లిపాయల సుబ్బయ్య మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కోరారు. దీనికి కౌన్సిలర్లు అందరూ అంగీకరించటంతో వెంటనే నిమిషం వ్యవధిలో చైర్మన్ ఆల్ పాస్ చేస్తున్నట్లు తీర్మానించారు. దీంతో కౌన్సిల్ సమావేశం 11:21 ప్రారంభమై 11:24 మూడు నిమిషాల్లో అజెండాలోని 41 అంశాలు ఆమోదం పొందాయి. బాబు జగ్జీవన్ రామ్ జయంతి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే విషయంలో తలెత్తిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ఉత్కంఠంగా ఉంటుందని పట్టణ ప్రజలందరూ ఊహించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విగాథం కలగకుండా పోలీసులు మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మోహరించి కౌన్సిల్ సమావేశం కు హాజరయ్యే వారందరినీ తనిఖీలు చేసి లోనికి పంపారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభించిన వెంటనే అంశాలన్నీ ఆమోదం జరగటంతో ఎలాంటి రాజకీయ పరిణామాలకు చోటు లేకుండా కౌన్సిల్ సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది. దీంతో మున్సిపల్, పోలీసులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు

మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ సహకారంతో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద చలివేంద్రం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచి కె.చిన్నయ్య మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ వేసవి చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చలివేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి కె. సత్యనారాయణ, గ్రామకార్యదర్శి కష్ణమోహన్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎన్ వసంత , టిడిపి నాయకులు విన్నకోట సతీష్ ,రామ సుబ్బారావు, శ్రీహరి, శేఖర్, గణేష్ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లూరు : కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దారు బి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసిల్దార్ ఎన్.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త బస్ సర్వీస్

ప్రజాశక్తి - రేపల్లె



ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి రేపల్లె డిపో నుంచి లంకెవానిదిబ్బకు వయా పెనుమూడి, చాత్రగడ్డ, పిరాట్లంక, గంగడి పాలెం మీదుగా నూతన బస్ సర్వీస్‌ను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుశీల్ కుమార్ తెలిపారు. ఈ బస్సు రేపలెలో ఉదయం 5:30, 9:30 గంటలకు, సాయంత్రం 6:10 బయలు దేరుతుందన్నారు. తిరిగి లంకెవానిదిబ్బ నందు ఉదయం 7:00, 11:00 రాత్రి 7:40గంటలకు బయలు దేరుతుందన్నారు. ప్రస్తుతం నడుస్తున్న. రేపల్లె లంకెవానిదిబ్బ వయా నల్లూరుపాలెం, తుమ్మల ,మోళ్ల గుంట, గంగడిపాలెం సర్వీస్ యథావిధిగా తిరుగుతుందన్నారు. ఈ సర్వీస్ రేపల్లెలో ఉదయం 6:15 ,11:00 మధ్యాహ్నం 2:30, సాయంత్రం 6:15 గంగడి పాలెం వరకు మరియు రాత్రి 9:30 గంటలకు బయలు దేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజరు తెలిపారు.

సాధారణ కాన్పులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-పర్చూరు



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

ప్రతి ఒక్కరూ సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని సిహెచ్‌సి గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత తెలిపారు. పర్చూరు సి హెచ్‌సి లో సాధారణ కాన్పుల వల్ల తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ సాధారణ కాన్పు వల్ల తల్లికి క్షేమం, బిడ్డకు రక్ష అని తెలిపారు. తల్లి బిడ్డల సంక్షేమం అందరి ధ్యేయమని తెలిపారు. గర్భం దాల్చక ముందే సాధారణ కాన్పుపై అవగాహన కోసం దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో కౌన్సిలింగ్ తీసుకోవాలన్నారు. సాధారణ కాన్పు వల్ల తల్లి, శిశువు మరణాల రేటు తగ్గుతుందన్నారు. తల్లి వెంటనే కొలుకొని బిడ్డకు ముర్రు పాలు ఇస్తుందన్నారు. తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఏర్పడుతుందన్నారు. తల్లి మానసికంగా ఆత్మస్థైర్యం కలిగి ఉంటే పాలు సమద్ధిగా ఉత్పత్తి అవుతాయన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు ఇవ్వడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయని తెలిపారు. సిజేరియన్ కాన్పు వల్ల అధిక రక్తస్రావం, రక్త హీనత కలుగుతుందన్నారు.తల్లికి ఇన్ఫెక్షన్ లు వచ్చే అవకాశం ఉందన్నారు. తల్లీ బిడ్డ మరణాల రేటు పెరిగే ప్రమాదం ఉందన్నారు. డెలివరీ అనతరం తల్లి మత్తు నుంచి మేల్కొనడానికి 3 నుంచి 4 గంటల సయమం పడుతుందన్నారు. తల్లి పూర్తిగా కొలుకోవడానికి 6 వారాలు పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ముర్రుపాలు ఇవ్వలేక పోవడం ,తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఉండదని చెప్పారు. తల్లీ బిడ్డల సంక్షేమం కోసం సాధారణ కాన్పును ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ డాక్టర్ సౌమ్య, జనరల్ సర్జన్ డాక్టర్ ఆలీ, హెడ్‌నర్స్ రత్న కుమారి, నర్సులు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి- భట్టిప్రోలు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ ఇంజినీర్ చిరంజీవి

విద్యుత్ చౌర్యం చట్టరీత్య నేరమని విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిరంజీవి తెలిపారు. తెనాలి డివిజన్ పరిధిలో పలు మండలాలకు చెందిన 120 మంది విద్యుత్ ఉద్యోగులు భట్టిప్రోలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఏకకాలంతో విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. మొత్తం 4,721 సర్వీసులను తనిఖీ చేశారు. అందులో 66 మంది వినియోగదారులు అధిక లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించి వారికి రూ.2,92,500 అపరాధ రుస్తుం విధించారు. విద్యుత్ చౌరానికి ప్పాలడుతున్న ఓ వ్యక్తిని గుర్తించి అతనికి రూ.4,000 అపరాధ రుసుం విధించారు. అదేవిధంగా అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న ఐదుగురిని గుర్తించి వారికి రూ.47,000 అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డిపిఇ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్ఎం.ప్రసాద్ , రేపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధీర్ బాబు, భట్టిప్రోలు ఎఇ ఎం. శాంతకుమారి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం : మండల పరిధిలోని రూరల్ సెక్షన్‌లో విజయవాడ విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఇ వి విజయ కష్ణ , ఆపరేషన్ ఇఇ కె జాన్ థామస్ , విజిలెన్స్ సిఐ బిటినాయక్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది 34 బందాలుగా ఏర్పడి మొత్తం 3,101 సర్వీసులు తనిఖీ చేశారు. అధిక లోడు వినియోగిస్తున్న 93 మందిని గుర్తించారు. మేల్ ప్రాక్టీస్ 13 కేసులు, ఒక విద్యుత్ చౌర్యం కేసు గుర్తించి రూ.5,19,000 జరినమా విధించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.ఈ దాడుల్లో వేటపాలెం డిఇఇ జె. శ్రీనివాసులు, చీరాల డిఇఇ హరిప్రసాద్, పర్చూరు డిఇఇ ఎన్ రమేష్, వేటపాలెం రూరల్ ఎఇ భాస్కర్ రావు, చీరాల డివిజన్ ఎఇలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉచిత కుట్టుమిషన్ శిక్షణను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. చెరుకుపల్లి-2 సచివాలయంలో కుట్టుశిక్షణను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. 90 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండలంలో మొత్తం 344 మంది మహిళలు కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ లో 117 మంది, రెండవ బ్యాచ్ లో 114 మంది, మూడవ బ్యాచ్ లో 113 మంది కి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌లోని 117 మందికి రెండు గ్రూపులుగా విభజించి తొలి బ్యాచ్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండవ బ్యాచ్‌కి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి బ్యాచ్‌లో కుంచాల వారిపాలెం, రాంబొట్లపాలెం, తుమ్మలపాలెం, బలుసుల పాలెం, కావూరు, ఆరుంబాక, చెరుకుపల్లి, గుల్లపల్లి గ్రామాలకు చెందిన మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. రెండవ బ్యాచ్ లో పొన్నపల్లి, నడింపల్లి, గూడవల్లి, కనగాల, ఆల్లవారిపాలెం, రాజోలు, తూర్పు పాలెం, ఆరేపల్లి గ్రామాలకు చెందిన మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. 90 శాతం హాజరు కలిగి, పరీక్ష ఉత్తీర్ణులైన వారికి ఉచితంగా కుట్టు మిషన్ అందజేయనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతాంగ,కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప కమ్యూనిస్టు ఉద్యమకారుడు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. సిపిఐ వేమూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా 28 సంవత్సరాల పాటు పార్టీ అభివద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్ర పోషించి నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతుల, కార్మికుల హక్కుల కోసం ఉద్యమించినట్లు తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా రైతుల తరపున అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వి.శ్రీనివాసరావు, ఒబులశెట్టి రమేష్, ఎఐటియుసి నాయకులు డి. నాగరాజు, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్రోణాదుల గ్రామ చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- మార్టూరు

మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామచరిత్ర అనే పుస్తకాన్ని నాగార్జున విశ్వవిద్యాలయ విశ్రాంత రిజిస్ట్రార్ ట్రావెల్ సాంబశివరావు స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆవిష్కరించారు ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3000 సంవత్సరాల చరిత్ర ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. గ్రామ చరిత్ర పుస్తకాన్ని పెంట్యాల రాజా రచించాడు. రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేడూరు సత్యనారాయణ అధ్యక్షతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆహ్వానితులను మద్దుమాల కోటేశ్వరావు వేదిక పైకి ఆహ్వానించారు. గ్రామంలో కులాలవారీగా వారి జీవనశైలిని ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యు.దేవపాలన, మాజీ ఎంపిపి నాగబోయిన రంగారావు, ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజర్ వసంత కోటేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అమరా రాజగోపాల్ రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పెంటల జగన్మోహన్ రావు, కనపర్తి సూరిబాబు, పుస్తక రచయిత పెంటేల రాజా పాల్గొన్నారు.

సిఎం హామీల అమలుకు

చిత్తశుద్ధితో పనిచేయాలి..

అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి కోరారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పేదల సేవ కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల అమలులో అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. పర్చూరు నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, ప్రతి మండలంలో ఒక అంబేద్కర్ భవన నిర్మాణానికి, సబ్ స్టేషన్ల నిర్మాణానికి, గ్రావెల్ రోడ్ల ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చినగంజాం మండలంలో కొత్త గొల్లపాలెం గ్రామంకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో వ్యక్తిగత అవసరాలకు సంబంధించి పనులను ఆయా శాఖలకు తెలియజేయాలని, నిబంధనల మేరకు వాటి పూర్తికి చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా సామాజిక అవసరాలకు సంబంధించిన పనులను ఆయా శాఖలకు తెలియజేస్తూ వేరువేరుగా ఉత్తర్వులు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. ఆ గ్రామంలో పి4 కింద ఎన్నిక కాబడిన కుటుంబాల అవసరాలను మార్గదర్శలతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్డిఏ ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, పిడి డిఆర్డిఏ కె. శ్రీనివాసరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సూర్యలంక, రామాపురం బీచ్‌లను

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సూర్యలంక, రామాపురం బీచ్‌లను జూలై నెలలోగా పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు, కన్సల్టెంట్‌లతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతం కానుందని కలెక్టర్ చెప్పారు. జులై నెల నాటికి బోటింగ్ షికార్ అమల్లోకి తెచ్చేలా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని, కాలుష్యం లేని ప్రాంతంగా ఈ రెండు బీచ్‌లను ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే 20 మంది శాస్త్రవేత్తలు ఆ రెండు బీచ్‌లలో పర్యటించి, అధ్యయనం చేశారని వివరించారు. పరిశుభ్రమైన ప్రాంతంగా బాపట్ల జిల్లాలోని ఆ రెండు బీచ్‌లు ఉన్నాయన్నారు. రాజస్థాన్, గుజరాత్ లోని పర్యాటక ప్రాంతాల మాదిరిగా తీర్చిదిద్దడానికి అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలో జీడిపప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తి ప్రదర్శనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తాటి చెట్ల ఆధారంగా ఉత్పత్తులు పెంచేలా కల్లు గీత కార్మికులకు, బోటింగ్ షికారు జరిగేలా మత్స్యకారులకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శనల కొరకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు సంబంధించిన ఒక ఎకరా భూమిని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివద్ధి చేస్తామన్నారు. లేదా ఏజెన్సీలకు ఆ భూమిని లీజ్ ఇవ్వడానికి పరిశీలనలు జరుగుతున్నాయన్నారు. పర్యాటకానికి ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేరలి కెనాల్ బోటింగ్‌కు అనువైన ప్రాంతంగా పర్యాటకల కోసం సిద్ధం చేస్తున్నామన్నారు. బీచ్‌ల వద్ద రిసార్ట్స్ నిర్వహణలపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అత్యవసరమైన అభివద్ధి కోసం రూ.1.13 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, పర్యాటక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లజ్వంతి నాయుడు, కన్సల్టెంట్ సాహితీ దివి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, జేసీ

అనధికార లేఅవుట్స్‌లో

ప్లాట్స్ కొనుగోలు చేయొద్దు

జేసీ ఆర్.గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని సంయుక్త కలెక్టర్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(ఒడా) వైస్ చైర్మన్ ఆర్.గోపాలకష్ణ తెలిపారు. స్థిరాస్తి కొనుగోలుదారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు వంటి వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా రూపొందించిన పోస్టర్లు కరపత్రాలను బుధవారం ప్రకాశం భవనంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆవిష్కరించారు.

ఇంగ్లీషు సిలబస్ భారం తగ్గించాలి...

డిఇఒకు ఎపి ఇంగ్లీష్ ఫోరం వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆరు నుండి పది తరగతుల వరకు ఇంగ్లీష్ సబ్జెక్టు సిలబస్ భారం ఎక్కువగా ఉందని, తగ్గించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్‌ను ఎపి ఇంగ్లీష్ ఫోరం నాయకులు కోరారు. బుధవారం ఒంగోలు డిఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూలులో జరుగుతున్న టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో డిఈఒను వారు కలసి వినతిపత్రం అందజేశారు. ఎపి ఇంగ్లీష్ ఫోరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం డిసెంబర్‌లో విడుదల చేసే పదో తరగతి షెడ్యూల్ ప్రకారం స్టడీ అవర్స్ నిర్వహించే సమయానికి సిలబస్ పూర్తి కావడం లేదన్నారు. సిలబస్ తగ్గించినట్లయితే ప్రభుత్వంవిడుదల చేసే పదవ తరగతి ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయుటకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపాలని వారు కోరారు. డిఇఒను కలిసిన వారిలో ఏపీ ఇంగ్లీష్ ఫోరం నాయకులు శ్రీరాంశ్రీనివాసరావు, మరియరాజు, బుర్ల కోటేశ్వరావు, శరత్చంద్ర ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులపై ముందస్తు చర్యలు

- పశువుల నీటి తొట్టెల లక్ష్యాలు పూర్తి చేయాలి
- పిఎం సూర్యఘర్ పథకం పటిష్టంగా అమలు
- జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాబోయే వేసవి కాలంలో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు అధ్యక్షతన జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) బుధవారం జరిగింది. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియాతో కలసి జాతీయ ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ కార్యక్రమం, పిఎం సూర్యఘర్ పథకం, పిఎం గ్రామీణ సడక్ యోజన, పిఎం ఆవాస్ యోజన పథకాలలో పేదలకు మంజూరు చేసిన గహ నిర్మాణాల పురోగతి, అమత్ 1, అమత్ 2 పథకాల ద్వారా ప్రజలకు తాగునీటి పథకాల అమలు, పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దిశ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుత కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల అమలు, పురోగతి పై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తామన్నారు. ప్రజలతో పాటు మూగ జీవాలకు కూడా తాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించే పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు త్వరగా పుర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాబోయే 3 నెలలకు (ఏప్రిల్- జూన్) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా లోని ఉపాది కూలీలకు 1.11 కోట్ల పని దినాలను 2.95 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా లక్ష్యాలు నిర్దేశించారన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా చేపట్టబోయే పంచ ప్రాధాన్యాలైన పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం, నిర్దేశించిన లక్ష్యం మేరకు వాటి నిర్మాణం పూర్తి చేయటం, పంట కాలువ పూడిక తీయటం, సాగు నీటి చెరువులు పూడిక తీత, సగటు కనీస వేతనం రోజుకు 290 -300 రూపాయలు తగ్గకుండా ఉండేలా కృషి చేయాలని డ్వామా అధికారులను ఆదేశించారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్ర

జిల్లాలో పౌష్టికాహార పక్షోత్సవాలు

జిల్లావ్యాప్తంగా ఈ నెల 8 నుండి 22 వ తేదీ వరకు 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పఖ్వాడా) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో రోజుకొక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. మొదటి 1000 రోజుల వరకు బేబి సంరక్షణపై శ్రద్ధ వహించటం,, లబ్ధిదారులు స్వయంగా వారంతట వారే తామే పోషన్ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానంపై ప్రచారం చేయటం, పిల్లలలో పోషకాహార లోపం నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేస్తున్నామనానరు. రక్తహీనత కలిగిన కిషోర భాలికలపై, హై రిస్క్ గర్భిణీలు, ఊబకాయ పిల్లలు, బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక దష్టి సారించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ వివరించారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్ల కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత కోరారు. అమత్ పథకంలో ఒంగోలు నగరంలో చేపట్టిన పైప్ లైన్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని, ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని,ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కోరారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ఉపాధి హామీ పథకంలో కొత్త వాటర్ షెడ్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన అమూల్ సెంటర్స్ ను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. అసంపూర్తిగా వున్న సచివాలయాలు, ఆర్‌బికె నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంత నూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్ కోరారు. అమత్ పథకంలో సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టే పనుల వివరాలు తెల్పాలని ఆయన అధికారులను కోరారు. సమావేశానికి హాజరైన పలువురు జడ్పీటిసిలు, ఎంపిపి లు ఆయా మండలాలకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఎంపి మాగుంట

బంగారు బాల్యం కార్యక్రమానికి జాతీయ స్థాయిలో జిల్లాకు స్కోచ్ అవార్డు రావడం పట్ల ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు పూల మొక్కను బహుకరించి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సిఈఒ బి. చిరంజీవి, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డ్వామా పిడి జి.జోసెఫ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకర రావు, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.